# మానవ హక్కులను హరించినవారిని పాలకులుగా కొనసాగనిద్దామా ?

తెలంగాణా శాసన సభకు డిసెంబరు 7 న ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికలు సాధారణ క్రమంలో రాలే. కె.సి.ఆర్. కోరిక మేరకు వచ్చినయ్. ఆయకు శాసనసభలో మెజారిటి ఫుల్లుగుంది. గ్రహాలగతులే మంచిగలేవట! గందుకె ముందస్తు ఎన్నికలు.

పార్టీలు ఎడాపెడా ఇస్తున్న వాక్కు దానాలను అధికారానికి వచ్చిన తర్వాత నెరవేర్చకపోతే వారిని నిలదీసేందుకు అవకాశం ఇవ్వగల చట్టం ఏదీ లేనందున మాయ మాటలతో గారడి చేస్తున్నరు. వీళ్ళు ఇస్తున్న హామీలను అమలు చేయాలంటెనే ఏడాదికి లక్షకోట్ల రూపాయలు గావాలె. రాష్ట్ర వార్షికాదాయం ఇంకా లక్షకోట్లకు చేరుకోలే. వీటన్నిటికి పైసలు గావాల్నంటె అప్పులు జెయ్యాలె. అప్పులు కట్టనీకీ, మిత్తి గట్టనీకి పన్నులు వెయ్యాలె. అంటె రాబోయే రోజుల్ల పన్నుల భారం పెరుగుతది అన్నట్టు. ఈ ముచ్చట్లు ఎప్పుడు ఉండెటియే గని వేరె సంగతులు చెప్పుకుందమా?

ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎన్నికలు కీలకమేగానీ ఎన్నికల ప్రక్రియను ఓ ప్రహసనంగా మార్చివేస్తున్నాయి పార్టీలు. రాజ్యాంగం ఎడల నిబద్ధత గలిగి ప్రజల క్షేమమే పరమావధిగా గల, అవినీతికి లొంగని రాజకీయ నాయకులు కనుమరుగైపోతున్నారు. వందలకోట్లకు పడగలెత్తిన వారే పాలక పార్టీల అభ్యర్థులు. అప్పుడు అధికారం వ్యాపార సామ్రాజ్యాల విస్తరణకు సాధనం కాక మరేమవుతుంది?

ఎమ్మెల్యేలను మేం ఓ ప్రశ్న అడుగుతున్నాం. ఏ పార్టీ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచారో ఆ పార్టీకే నిబద్ధులుగా ఉంటారా? ఒక పార్టీ అభ్యర్థిగా గెలిచి వేరే పార్టీలోకి దూకడం నీతిమాలిన పని కదా?అలాంటి వారిని చేర్చుకునే పార్టీ ఇంకెంత నీతిమాలినదో? గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించకుండా ఉంటారా? అధికార పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించకుండా ఉంటుందా?

పార్టీ మారిన ఎమ్మెల్యేని అన్ని రకాల ఎన్నికలలోనూ పాల్గొనకుండా శశ్వతంగా అనర్హుడిగా ప్రకటించడానికి అనువుగా ఉండే చట్టాన్ని రూపొందించమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరతారా?

## జనాన్ని మాట్లాడుకోనిస్తారా?

నాలుగున్నరేళ్ళుగా తెలంగాణ ప్రజలు మాట్లాడుకునే స్వేచ్ఛకు దూరమయ్యారు. ప్రజాస్వామ్యం చలన శీలంగా ఉండాలంటే అభిప్రాయాల మధ్య నిరంతర సంవాదం జరగాలి. ప్రభుత్వ విధానాల మీద నిరసన తెలిపే హక్కు ఉండాలి. ప్రజాభిప్రాయం కూడగట్టే హక్కుండాలి. ప్రజాస్వామ్యం ఇచ్చిన అన్ని రకాల స్వేచ్ఛలనూ ఉపయోగించుకొని అధికారానికి వచ్చిన తెరాస పార్టీ ప్రభుత్వం ప్రజలకు మాత్రం ఆ హక్కులను నిరాకరించింది.

మాట్లాడుకోవాలంటే జనం ఒక దగ్గర జమగూడాలి. అట్లా జమగూడుదామంటే సెక్షన్ 144 ని ఉపయోగించారు. ఊరేగింపు తీద్దామంటే పోలీసు చట్టంలోని సెక్షన్ 30 ని వాడారు. కె.సి.ఆర్. మీటింగులకు పోబోతే గోల చేస్తారేమో ననే అపోహతో ముందస్తు అరెస్టలు. ప్రతిపక్షం మీటింగులకు పోతే అవి ఎక్కడ సక్సెస్ ఆయిపోతాయోననే అక్కసు తో ముందస్తు అరెస్టులు. రాష్ట్రంలో జరిగింది పోలీసు పాలననే. ఇవి చాలవన్నట్లు మూడు ఎన్‌కౌంటర్లు. మొత్తం పదహారు మందిని పట్టుకుని కాల్చిచంపి ఎదురుకాల్పుల కథలల్లారు. ఒక్క ఎన్కౌంటరులోనూ ఒక్క పోలీసుకూ చిన్న గాయం కూడా కాలే. ఎనకౌంటర్ పేరుతో పదహారుమందిని చంపిన పోలీసు అదికారులపై చట్టం ప్రకారం కేసులు పెడతారా? పెట్టరుగానీ ఎన్‌కౌంటర్లు జరిపే రాజకీయ విధానానికి స్వస్తి పలుకుతారా?

గ్యాంగ్‌స్టర్ నయీం కేసులో పెద్ద పెద్ద వారి పేర్లు బయట పడడంతో దర్యాప్తు ను మూలకు విసిరేసినట్లున్నారు. దాన్ని బయటికి తీస్తారా? పోలీసు స్టేషన్లు అవనీతిమయం అయి పోయాయి. క్రిమినలు ప్రొసీజరు కోడ్ లోని సెక్షన్ 44 ఏ పోలీసుల అవినీతికి మరింత అవకాశం ఇవ్వడమే కాదు పోలీసులకు న్యాయాధికారాలను కూడా ఆచరణలో కట్టబెట్టింది. దాన్ని మార్చండి అని న్యాయవాదులు సమ్మె చేసారు. పోలీసుల అధికారాన్ని కుదించేలా చట్టాన్ని మారుస్తరా?

## అభివృద్ధా? విధ్వంసమా?

ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీలు చెప్పే అభివృద్ధిలో ప్రజల బాగు కన్నా విధ్వంసమే ఎక్కువ జరుగుతోంది. విద్యుదుత్పత్తి కోసం తవ్వుతున్న ఓపెన్ కాస్టు గనుల వల్ల ఆదిలాబాద్, కరీంనగర్, భూపాలపల్లి జిల్లాలు బొందలగడ్డలుగా

మారుతున్నది కనబడడం లేదా?వాటి నుంచి వచ్చే దుమ్ము- ధూళితో పత్రహరితం తయారు కాక మొక్కలు గిడసబారి పోతున్నయ్. ఆక్కడి జనం ఊపిరితిత్తుల నిండా దుమ్మే.భారీ ప్రాజెక్టులను తలపెట్టి వాటికి భూమి అవసరం అని జరుపుతున్న భూసేకరణ వల్ల అక్కడి ప్రజలు విస్థాపనకు గురవుతున్నారు. అలాంటి బాధితులను ఆదుకోవడానికి వచ్చిన 2013 నాటి భూసేకరణ చట్టం స్ఫూర్తిని మింగేసే తెలంగాణ సర్కారు తెచ్చిన సవరణను వెనక్కి తీసుకుంటరా?

**ఆదివాసుల గోస:**

తెలంగాణ రాష్ట్రంలో 1976 నుంచి లంబాడీలకు ఎస్. టి. హోదా కల్పించారు. దీన్ని ఆదివాసీలు వ్యతిరేకిస్తున్నారు.గత రెండేళ్ళలో వారి ఉద్యమం తీవ్ర రూపం దాల్చింది. ఇరుపక్షాలనూ కూర్చోబెట్టి సమస్యను పరిష్కరిస్తారా? ఆదివాసులు సాగుచేసుకుంటున్న భూముల్లోకి వారిని పోనీయకుండా గూడేలచుట్టూ కందకాలు తవ్వి దిగ్బంధించారు. చేతికొచ్చిన పంటలను ధ్వంసం చేసారు. విదేశీయులనుంచి వచ్చిన శత్రువుల్లా చూస్తూ గొత్తికోయలను హింసించారు. ఈ దమనకాండను తిరిగి జరపకుండావుంటారా? రెగ్యులేషన్ వన్ ఆఫ్ 70 ని అమలు జరపఢానికి ఇంకా ఎన్ని రోజులు కావాలి?వర్షాకాలంలో విషజ్వరాలు... ఎండాకాలంలో గుక్కెడు నీళ్ళ కోసం కటకట... 70 ఏళ్ళనుంచి ఇదే. దీన్ని మార్చే రాజకీయ సంకల్పం ఉందా?

దళితులమీద దాడులు పెరిగి పోయినయ్. నేరెళ్ళ, బోంపెల్లిలలో పోలీసుల దౌర్జన్యం.... బుస్సాపూర్‌లో గులాబీ నేతల కనుసన్నల్లో సర్పంచి మమత పై సంఘ బహిష్కారం. నిజామాబాద్ జిల్లాలో విలేజ్ డవలప్‌మెంట్ కమిటీల ఆగడాలకు కళ్ళెం వేయగలరా?

మిత్రులారా,

గులాబీ పార్టీ ప్రభుత్వం గత నాలుగున్నరేళ్ళుగా మానవ హక్కుల హననానికి పాల్పడుతూ వస్తోంది. రాజ్యాంగాన్ని అపహాస్యం చేసింది. కోర్టులను తూలనాడింది. మానవ హక్కుల హననానికి పాల్పడిన పోలీసులను పన్నెత్తి మాట అనలే. హత్యలు చేసిన పోలీసుల పై కనీసం కేసులు నమోదుచెయ్యలే. ప్రకృతినీ, పర్యావరణాన్నీ విధ్వంసం చేసే, ప్రజలను విస్థపనకు గురిచేసే అభివృద్ధి నమూనాను నిరంకుశంగా అమలు చేసింది. రైతుల ఆత్మహత్యలను నివరించే భరోసా ఇవ్వలేక పోయింది. రైతుల భూములను

లాక్కోడానికి వీలుగా చట్టాన్ని చేసింది. ఫిరాయింపులను ప్రోత్సహించి, ప్రతిపక్షాన్ని నామమాత్రం చేసి ప్రజాస్వామ్యాన్ని పరిహసించింది.. యూనివర్సిటీలలో ఉపాధ్యాయులను నియమించకుండా , వాటికి తగిన నిదులు ఇవ్వకుండా విద్యార్థుల, నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడింది. కాంట్రాక్టు ఉద్యోగులను అలానే కొనసాగించింది. వివిధ సెక్షన్ల ప్రజల హక్కులను హరించింది.కానీ ఎక్కడా, ఎన్నడూ పశ్చాత్తాపం ప్రకటించకపోగా దొరల దర్పంతో జనాన్నే దబాయించారు సర్కారీ పెద్దలు. కోట్ల రూపాయలు దండుకొన్నారు అనే విమర్శ ఎలాగూ ఉంది. ఈ పరిస్థితి ఇట్ల కొనసాగవలసిందేనా?

కొత్త పాలకులు వచ్చినంత మాత్రాననే పాలనలో గుణాత్మక మార్పు వచ్చేస్తుందనే భ్రమలు లేవుగానీ ప్రజల హక్కులను హరిస్తూ, రాజ్యాంగాన్ని పదాల గంప గా అనుకొంటూ, ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తూ, అధికార మదోన్మత్త ప్రేలాపనల తో ప్రజలను బెదిరిస్తూ ఉంటే ప్రజలు సహించరు అనే సందేశం ప్రజల నుంచి పాలకులకు అందాలి.

దోపిడి చేస్తే ప్రాంతేతరులను
దూరం దాక తన్ని తరుముతం
ప్రాంతం వాడే దోపిడి చేస్తే
ప్రాణంతోనే పాతర వేస్తం

అన్నారు కాళోజీ.... ఇది తెలంగాణ ప్రజల గుండె స్పందనల వ్యక్తీకరణ. రాజకీయ నాయకుల ప్రాణం ఓటు లో ఉంది. కాళోజీ మాటను నిజం చేయాలె. అప్పుడే తెలంగాణకు భవిత.

30 నవంబర్ 2018

---

## మానవ హక్కుల వేదిక (HUMAN RIGHTS FORUM)

**నిజామాబాద్ జిల్లా కమిటీ**